ఈవారం కథ

# జడ కుప్పెలు

- బలభద్రపాత్రుని రమణి

"కలకలలాడు వాలు జడకై జగమెంత
తపస్సొనర్చెనో చెలియ భుజావ వ్రాలి
కుచ సీమ నటించుచు ఏటి దాటులో
తొడ మనమునంపులోబడి తూలుచు..."

అద్భుతమైన రసమేదో ఆయన గొంతులో నుండి ప్రవహిస్తుండగా చదువుతున్న పద్యం ఆపి కళ్ళు అరమోడ్చి "అచ్చం మన హేమాసుందరి వాలుజడలా అన్నమాట!" అన్నారు సీతారామశాస్త్రి మాష్టారు.

ఆ మాటకి కిల కిలా నవ్వింది హేమ.

పాఠం వింటున్న పిల్లలు అందరూ తలలు తిప్పి హేమని చూసారు. బంగారంతో రంగరించిన వెన్నెల ముద్దలా వుంది హేమ. ఆమె మెడ మీదుగా ముందుకి పడిన వాలుజడ నేలను ముద్దాడుతూ అల్లనల్లన వూగుతోంది.

కృష్ణా నదీ తుళ్ళింతలని కళ్ళింతలుగా చేసుకుని చూసినట్టు చూస్తున్న మాష్టారితో "చాలు చాలు దిష్టి తగిలేను పిల్లకి... ఇంక ఇంటికి వెళ్ళి అమ్మతో ఇంత ఉప్ప దిగదుడిచి పొయ్యమని చెప్పమ్మా" అంటూ వచ్చింది మాష్టారి భార్య మంగతాయారు.

మాష్టారుగారు కూడా నవ్వేసారు.

అందరూ ఇళ్ళకి వెళ్ళడానికి లేచి నిలబడ్డారు.

నేను కూడా లేచి నిలబడి అక్క వైపు చూసాను.

సుతారంగా జడని వెనక్కి వేసుకుంటూ, ఒయ్యారంగా లేచి నిలబడింది హేమక్క.

నేను హేమక్క జడ వైపు ఈర్ష్యగా చూసాను.

గోపాలం బావ హేమక్క పువ్వకాల సంచీ అందుకుని భక్తిగా వెనక నడుస్తున్నాడు.

హేమక్క చక చకా నడుస్తూవుంటే, నాగస్వరానికి ఆడే పాములా మెలితిరుగుతూ ఆ నల్లని జడ నా కళ్ళని చీకటి చేసింది. హేమక్క వెనకాల నడవడం అంత బుద్ధి తక్కువ పని ఇంకొకటి లేదు అనిపించింది.

* * *



"అమ్మా...ఎన్ని సంపెంగ పూలో....నాకు కొన్ని ఇయ్యవూ?" ఆశగా అడిగాను గోపాలం బావని.

గోపాలం వెంటనే వెనక్కి పెట్టేసుకుని "ఇవన్నీ హేమకే!" అన్నాడు.

నాకు ఉడుకుమోతుతనం ముంచుకు వచ్చేసింది.

"అన్నీ దానికేనా?" కళ్ళనిండా నీళ్ళు వచ్చేస్తుండగా అడిగాను.

బావ ఏమనుకున్నాడో గాని "సరే..ఒకటి తీసుకో" అంటూ ఇచ్చాడు.

"ఒకటేనా?" ఇంకా ఆక్రోశంగా అడిగాను.

"నీ ఎలక తోకకి అది చాలులే" అని నవ్వేడు గోపాలం.

"నాది ఎలక తోకా? అయితే హేమది బర్రె తోక. ఛీ...ఛీ...ఎంత అసహ్యంగా వూగుతోందో...బర్రె తోకలా" అంటూ ఏడుస్తూ అమ్మ దగ్గరకి పరిగెత్తాను.

అమ్మతో బామ్మ అంటోంది "అన్ని సొమ్ములూ కరిగిపోయాయి. కానీ ఈ జడ కుప్పెలు మాత్రం ప్రాణంగా దాచుకున్నాను. హేమకి ఇవి పెట్టి జడ వెయ్యి ఆదివారం"

మిలమిలా మెరిసిపోతున్న ఆ కుప్పెల్ని చూడగానే నాకు అప్పడెప్పుడో చూసిన చార్మినార్ బురుజులు గుర్తొచ్చాయి. ఎంత బావున్నాయో!

"అమ్మా...ఇవి పెట్టి నాకు ఒకసారి జడ వెయ్యమ్మా!" అంటూ నా ఏడుపు మరిచిపోయి అడిగాను.

"ఉష్..గొడవ చెయ్యకు. ఇవి హేమక్కకి తర్వాత నీకే ఇస్తుందిలే" అంటూ అమ్మ లేచి బీరువాలో దాచడానికి వెళ్ళిపోయింది.

"తరువాత... తరువాత... తరువాత... అన్నీ తరువాతే! హేమక్క తరువాత పుట్టడం వల్లే అసలివన్నీనూ...ఛీ...ఛీ...అసలు లోకంలో ఎవ్వరూ తరువాత పుట్ట కూడదు అనిపించింది.

ఈ సంగతి నాన్నగారికి చెప్పి పేచీ పెట్టడానికి ఆయన దగ్గరికి పరుగు పెట్టాను.

నాన్నగారు పడక కుర్చీలో కూర్చుని గంభీరంగా చుట్ట కాలుస్తున్నారు.

అత్తయ్యా, మావయ్యా కూడా అక్కడే వున్నారు.

అత్తయ్య ఎందుకో కళ్ళు తుడుచుకుంటూ "చిన్నప్పట్నించీ అనుకున్న సంబంధం...వాడు ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు, చదువంటే అబ్బలేదు కానీ నలుగురి పని ఒక్కడు చెయ్యగలడు. మేనరికం కాదంటే రేపు నలుగురిలో తల ఎత్తుకుని తిరగగలమా మేము..." అంటోంది.

నాన్న లేచి కూర్చుంటూ..."పిచ్చి మొద్దూ...పెద్ద దానికి కుదరదంటున్నాను కానీ మేనరికం ఇవ్వ ననడం లేదే...తరువాత.

ఇంకో పిల్ల ఎదిగి వస్తోందిగా...దాన్ని చేసుకో గోపాలానికి" అన్నాదు.

"కానీ వాడు హేమని..." అని అత్తయ్య ఏదో చెప్పబోతుంటే.

"బొడ్డూడని వెధవ! వాడికి ఇష్టం ఏమిటి? చిన్నప్పటి నుండీ పెద్దవాళ్ళు నీ పెళ్ళాం అని నేర్పి పెట్టారు. కాబట్టి ప్రాణంగా చూసుకుంటున్నాడు. రేపట్నుండీ రమ చుట్టూ తిరుగుతాడు చూడు!" అంటూ గలగలా నవ్వేసారు.

కాళ్ళు బాదుకుంటూ ఏడుద్దామని వెళ్ళిన దాన్ని, కాళ్ళ అలికిడి అవకుండా పిల్లిలా వెనక్కి వచ్చేసాను. హేమక్కతో ఈ సంగతి చెప్దామని వెళ్ళేసరికి అమ్మ హేమక్కతో అంటోంది "డాక్టరీ చదువుతున్నాడట పెళ్ళికొడుకు! వాళ్ళకి నువ్వు నచ్చితే అంతే చాలమ్మా! లేకుంటే ఏవుందీ... నువ్వూ ఈ వూళ్ళోనే నీ వే ఇంటిలో పేడ అలుక్కుంటూ గడిపెయ్యాలి జీవితం అంతా."

పేడ అలకటం అన్న పదం బాగోక పోయినా, బావను చేసుకోవటమన్న భావం నన్ను గాలిలోకి లేపింది.

* * *

ఆదివారం హేమక్కకి పెళ్ళి చూపులు జరిగాయి. తలంటు పోసుకున్న జడలో బుట్టెడు జాజులు పెట్టారు. జడ కుప్పెలు ముందుకు పడేలా వేసి కూర్చోబెట్టారు. అదేదో పౌరాణిక సినిమాలో దేవతా స్త్రీలా వుంది అక్క!

నేనూ ఓణీ వేసుకున్నాను. ఉత్సాహంగా కాబోయే బావగారిని చూద్దామని ముందు గదిలోకి వెళ్ళబోయాను.

"ఎక్కడికి?" అంటూ జబ్బ వూడొచ్చేటట్లు పట్టుకుంది బామ్మ.

"బావని చూస్తాను" గొంతు తగ్గించి చెప్పాను.

"నీ బావ పెరట్లో వున్నాడుగానీ, ఈ మిఠాయి వుండలు పట్టుకెళ్ళి వాడికియ్యి" అంటూ నన్ను పెరట్లోకి తరిమింది.

మూతి సున్నాలా చుట్టుకుని బావ కోసం వెళ్ళాను.

గోపాలం బావ బావి పళ్ళెం దగ్గర మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చున్నాడు.

"బావా...ఇదిగో లడ్డూ" పిలిచాను.

"నాకేం ఒద్దు...అవతలికి పో" కసురుకుంటూ అన్నాడు.

బావ అలా ఎప్పుడూ నన్ను కసురుకోలేదు. అక్క కసిరితే కూడా దగ్గరకు తీసి చిన్నపిల్ల అంటూ ముద్దు చేస్తాడు.

"మరేం కావాలమ్మా..." అతని గడ్డం పట్టి పైకి ఎత్తుతూ అడిగాను.

"హేమ కావాలి" కళ్ళనిండా నీళ్ళతో అన్నాడు.

"ఇస్తావా? నా హేమని వాడెవరికో ఇచ్చి పెళ్ళి చేస్తారుట... ఇది న్యాయమా! చదువులేని వాడినే కదా ఇంత చులకనా!" అంటూ మళ్ళీ తల వంచేసుకున్నాడు.

నాకూ ఏడుపు వచ్చేసింది. మొత్తం పెద్దవాళ్ళందరి మీదా కసి కలిగింది. అసలు నేను పుట్టకపోతే హేమనే బావకిచ్చి చేసేవారేమో...తర్వాత నేను వున్నాననేగా వాళ్ళ ధీమా అనిపించింది.

హేమక్క పెళ్ళి కుదిరిపోయింది. ప్రధానం కూడా జరిగిపోయింది. పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకున్నారు.

* * *

అసలే అందగత్తె. పెళ్ళి కూతురి అలంకరణలో అక్క మరీ మెరిసిపోతోంది.

"అక్కా...నీ జడ కుప్పెలు ఇస్తేగానీ తోడపెళ్ళికూతురిగా కూర్చోను" బుంగమూతి పెట్టి అన్నాను.

అక్క దిగులుగా చూసింది. "కుప్పెలేం ఖర్మ అంతకంటే విలువైనదే నీ కోసం వదిలిపెట్టి పోతున్నానే" అంది.



అక్క పెద్ద పెద్ద కళ్ళు రెండూ నీళ్ళతో నిండాయి.

"వద్దులే అక్కా...ఊరికే అడిగాను" అన్నాను.

"తీసుకో..." అంటూ అక్క జడ నుండి కుప్పెలు విప్పసాగింది.

"అదేం పనే?" అంటూ అమ్మ పరుగున వచ్చింది.

"మీ అత్తవారు ఏమనుకుంటారు? పది కాసుల బంగారం పెడ్తామని చెప్పి మాట తప్పామని మా మీద నింద వెయ్యరూ... దానికి కావాలంటే తరువాత పంపిద్దురుగానిలే" అంది.

అక్క పెళ్ళి అయిపోయింది. బావగారి చదువు అయ్యేదాకా ఇక్కడే వుండమని అక్కని వదిలి బావగారు వెళ్ళిపోయారు.

గోపాలం బావ మా ఇంటికే రావడం మానేసాడు. వచ్చినా అక్క ఎదురు పడ్తే పలకరించకుండా తప్పించుకుని తిరిగేవాడు. కానీ క్రమం తప్పకుండా వాళ్ళింటి నుండి సంపెంగలూ, సన్నజాజులూ పొట్లం కట్టి పంపేవాడు. అక్క జడ సంపెంగల్లో బావ ఆత్మీయత కనపడేది నాకు. నేను కాలేజీలో చేరాను. గోపాలం బావ చేతికి వచ్చాక వాళ్ళ పొలంలో బంగారం పండుతోందని అందరూ చెప్పుకుంటున్నారు.

బావగారి చదువు పూర్తయింది. అక్కని బోలెడు సారెతో అత్తారింటికి సాగనంపారు.

చిన్నప్పటి నుండీ ఆడపిల్లని ఆడించే ఆట 'అత్తారింటికి దారేదంటే...' అని కితకితలు పెట్టి బలవంతంగా నవ్వేస్తారు. పెద్దయ్యాకా నిజంగా వెళ్ళేటప్పుడు ఏడవక తప్పదని తెలుసుకా బట్టేమో!

* * *

పండక్కి అక్కని తీసుకు రావడానికి నాన్నగారితో కలిసి ఆ వూరు వెళ్ళిన నేను అక్కని చూసి నోట మాట రాక వుండిపోయాను.

అక్క కళ్ళల్లో మెరుపు లేదు! బుగ్గలు లోపలికి పోయాయి. ముఖ్యంగా వాలు జడ స్థానంలో కొప్పు పెట్టింది. సరైన సంరక్షణ లేని ఆమె కురులు రెల్లు తుప్పలని జ్ఞప్తికి తెచ్చాయి.

బావగారు పట్నంలో ప్రాక్టీసు పెట్టారుట. అక్కని తల్లి దగ్గరే వుంచార్ట. వారానికి ఒక రోజు వస్తారుట. అక్కకి రోజూ ఆడివంత పెరడు పాచి వెయ్యడం, ఇల్లు పేడతో అలకడం, పిడకలు వెయ్యడంతోటే సరిపోతుందిట. దానిలో వుత్సాహం

అక్క కళ్ళలో
మెరుపులేదు
బుగ్గలులోపలికి
పోయాయి.
ముఖ్యంగా
వాలుజడ స్థానంలో
కొప్పుపెట్టింది.
సరైన సంరక్షణలేని
ఆమె కురులు
రెల్లు తుప్పలను
జ్ఞప్తికి తెచ్చాయి.

లేదు. నవ్వులో జీవం లేదు. కీ ఇస్తే నడిచే బొమ్మలా తిరుగుతోంది.

అక్క జడ విప్పి దువ్వుతుంటే తెగి రాలిపోతున్న దాని వెంట్రు కలని చూస్తే నాకు ఏడుపొచ్చింది.

"చాలు అలంకరణలు! పని చూసుకో..." అంటూ అత్త గారి అదిలింపులూ, ఆడబిడ్డల హేళన నవ్వులూ నా దృష్టిని దాటిపోలేదు.

అక్కని పండక్కి మాతో పంపలేదు.

నా పెళ్ళి ముహూర్తాలు పెట్టుకుంటున్నారని నాన్నగారు వెళ్ళి ప్రాధేయపడితే ఒక్క పూట కోసం పంపారు అక్కని.

అక్క చాలా చిక్కిపోయింది. అత్తవారింట్లోని ఆచారాలూ, సాంప్రదాయాలూ చెప్పి విరక్తిగా నవ్వింది. "ఇంక వీటితో నాకు పని లేదు" అంటూ కొంగు మూట విప్పి కుప్పెలు తీసింది.

"జడ కుప్పెలతో వాలుజడ వేసుకుంటే 'ఎందుకీ బోగం వేషా లంటారు. కనీసం వీధి ముఖం చూసి ఎన్నాళ్ళయిందో.. ఇవి ఇక నుంచీ నీవే" అంటూ నా చేతిలో బలవంతంగా పెట్టింది.

ఆ రాత్రికే తిరిగి వాళ్ళ వూరు వెళ్ళిపోయింది. జడ కుప్పెలు నా తడి కనురెప్పల్ని ఓదార్చాయి. వేసవిలో నా పెళ్ళి తారీకు నిర్ణయించారు.

* * *

నా పెళ్ళికి అక్క నెల రోజులు ముందర వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న మాకు పిడుగుపాటు లాంటి కబురొచ్చింది. బావగారు ఆక్సిడెంట్‌లో చనిపోయారుట.

అమ్మా, నాన్నా కుప్పకూలిపోయారు. నేను గోపాలం బావని పట్టుకుని భోరుమని ఏడ్చేశాను. "అది కుప్పెలతోబాటు ఇవన్నీ నాకెందుకు అని సౌభాగ్యాన్ని కూడా వదిలేసిందా బావా? దాన్ని వితంతువుగా మనం చూడగలమా?" అని ఏడ్చాను.

పదో రోజు రేపనగా అమ్మ బావిలో దూకబోయింది. గోపాలం బావ సమయానికి రాబట్టి సరిపోయింది.

"వాళ్ళు మూర్ఖులు! ఛాందసులురా గోపాలం! దానికి కేశ ఖండనం చేయిస్తారట. దాన్ని అలా చూసి భరించగలమా?" అంటూ అమ్మ తల బాదుకుంది.

ఆ వార్త విని నేను మ్రాన్పడిపోయాను.

నాన్నగారు మా లోకంలోనే లేరు.

ఆ రాత్రి గోపాలం బావ పొగిలి పొగిలి ఏడవడం చూసాను. అక్క పెళ్ళి మూవుల రోజు కూడా ఏడ్చాడు కానీ ఏమీ చెయ్యలేకపోయాడు పాపం!

"బావా!" పిలిచాను.

కళ్ళు తుడుచుకుంటూ చూశాడు.

"ఇదిగో అక్కకి ఇవి ఇచ్చిరా..." అంటూ కుప్పెలు అందించాను.

బావ నా వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"అదెప్పుడూ ఇక నుంచీ వాలు జడకి ఒక అంచున నువ్వి చ్చిన సంపెంగలూ చివరి అంచున నేనిచ్చిన జడ కుప్పెలూ పెట్టుకోవాలి. నీకు ధైర్యం వుంటే...నువ్వు నిజంగా హేమని ప్రేమిస్తే... అక్క తల మీద కత్తి ఆనే లోపుగా అక్కని ఇక్కడికి తీసుకురా" అన్నాను.

బావ కుప్పెలు అందుకున్నాడు.

# ఖండాంతర ఖ్యాతిగన్న ఆంధ్ర ప్రముఖులు



## అగ్ర పీఠాన ఆంగ్ల రచయిత డాక్టర్ వాడ్రేవు పాండురంగారావు

తెలుగువారి విజయపతాకాన్ని ఎగురవే యబోతున్నందుకు వారిని ప్రత్యేకంగా అభినందించాలి. తెలుగు పలుకు బడి, తెలుగువారి భావంలో సొగ సులు ఆంగ్లంలోకి తీసుకురావడంతో వారు విశేషంగా శ్రమించారు.

బ్రిటిష్ పాలనాకాలంలో దేశాన్ని కొల్ల కొట్టిన బందిపోటు దొంగలు థగ్గులు - పిండారీల దృష్టిలో వుంచుకుని తెలుగుదేశం నేపథ్యంగా ఒక నవల రాసే ఆలోచనలో వున్నట్టు తెలు స్తోంది. అంటే ఈ వ్యంగ్య నవ లలో ఎవరెవరు పాత్రలుగా వుంటారో మనం ఊహించుకోవచ్చు. నేడు రంగారావుగారి రచనలు పలుదేశాలలో బాగా ప్రచారమవుతున్నాయి. 1989లో వారు ఇండో- ఆస్ట్రేలియన్ కల్చరల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాం క్రింద కాన్‌బెర్రా సందర్శించారు. బ్రిటీష్ కౌన్సిల్ ఆధ్వ ర్యంలో 1992లో పలు బ్రిటీష్ యూని వర్సిటీలను సందర్శించారు. యు.జి.సి. వారిని నేషనల్ ఫెలోషిప్‌తో గౌరవిం చింది. డాక్టర్ రావుగారి పరిచయం బ్రిటన్‌లో ప్రచురింపబడిన "ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ పోస్ట్ కలోనియల్ లిటరేచర్స్ ఇన్ ఇంగ్లీష్"లో ప్రచురిం పబడి ఆంగ్ల పీఠంపై ఆంధ్రులకు స్థానం కల్పించింది. తెలుగువారి గౌరవ ప్రతిష్టలకు వారి కృషి కలికితురాయిగా నిలబడనున్నది.

డాక్టర్ వాడ్రేవు రంగారావు 1936లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఎ. పూర్తి చేశారు. సుప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత అర్.కె.నారాయణ్‌పై పరిశోధనచేసి పిహెచ్.డి. డిగ్రీ పుచ్చుకున్నారు.

న్యూఢిల్లీ వెంకటేశ్వరా కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా స్థిరపడ్డాడు.

నిరుద్యోగ, ఉద్యోగ జీవితంలో రావు జొనథన్ స్విఫ్ట్ వంటి వ్యంగ్య రచయితల శిల్పాన్ని జీర్ణం చేసుకున్నారు. తన సొంత బాణీలో వాస్తవానికి వ్యంగ్యం జోడించి రచనలు ప్రారంభించారు. జగ ద్ప్రసిద్ధమైన పెంగ్విన్ ప్రచురణకర్తలు భారతదేశంలో గ్రంథాలు ప్రచురింప దలచినపుడు డాక్టర్ రావుగారు తన రచన "ఫాల్ ఫిల్చర్" (దొంగకోళ్ళు) నువారి పరిశీలనకోసం సమర్పించారు.

"ఫాల్ ఫిల్చర్" నవల(1987లో) పెంగ్విన్ సంస్థ తొలిసారిగా భారతదేశంలో ప్రచురించిన తొలి ఆంగ్ల నవల. దేశ విదేశాలలో బాగా ప్రచారమై రెండు సార్లు పునర్ముద్రణకు నోచుకుంది. 1989లో వారి ఆంగ్ల కథలను ఒక ప్రచురణ సంస్థ ప్రచురించింది.

అయితే 1994లో పెంగ్విన్ ద్వారావే వెలువడిన వారి నవల "డ్రంక్ తంత్ర" (THE DRUNK TANTRA) డాక్టర్ రావుగారిని ఉన్నత శ్రేణి నవలాకారుల సరసన కూచో బెట్టింది. ఢిల్లీ యూనివర్సిటీ - అందలి పరిసరాలు ఈ నవలకు కథా వస్తువు. ఉన్నత విద్యావేత్తల స్వార్థానికి విద్యా సంస్థలు ఎలా బలైపోతున్నాయో ఈ నవలలో వ్యంగ్యంగా వివరించడం జరిగింది. ఈ నవలను దేశ విదేశాలలోని పత్రికలు ప్రశంసించాయి.

డాక్టర్ రావుగారు తన రచనలలో పద సంపద పొందికకూ, శిల్పానికీ, శైలికీ విశేష ప్రాధాన్యం ఇస్తారు. ఇటీవల. 21 ప్రసిద్ధమైన తెలుగు కథలను ఆంగ్లంలో అనువదించి ఉపోద్ఘాతం, నోట్సు రాసి ప్రచురణకోసం పెంగ్విన్ సంస్థకు అప్పగించారు. ఈ కథలలో అరడజనుకుపైగా ప్రపంచ స్థాయి కథల స్థానానికి దీటైనవి వున్నవంటే అంతర్జాతీయ స్థాయిలో

— డా॥ వెలగా వెంకటప్పయ్య

23-6-95